మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాజీ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌టీయూ నేతలు

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ 'భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్' (బీఆర్‌టీయూ), జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ కాప్రా సర్కిల్ కమిటీ నేతలు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 22 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్నామని, చాలీచాలని జీతాలతో జీవిస్తున్నామన్నారు. ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లల చదువులకు ఖర్చు పెట్టలేక దుర్భరమైన జీవితం సాగిస్తున్నామని వాపోయారు. ఉద్యోగ భద్రతతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాప్రా సర్కిల్ కమిటీ అధ్యక్షుడు కుర్మన్న, మల్లేష్, జాన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మధ్యాహ్న భోజనం తయారీ కేంద్రం పరిశీలన



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఉప్పల్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందించే మిడ్ డే మీల్స్ తయారీ కేంద్రాన్ని సోమవారం మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఉప్పల్ పారిశ్రామికవాడలోని మన్నా ట్రస్ట్ ద్వారా రోజూ రూ.80,000 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి ప్యాక్ చేసి అందించే కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

పౌష్టికాహారం అందించాలి..

భోజనం వండే విభాగం, స్టోరేజ్ గది, గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజూ ఎంత మందికి అన్నం వండుతారని, ఎప్పటి నుంచి వంటలు మొదలు పెడతారని, తదితర విషయాలను నిర్వాహకులు రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

తేదీ తప్పనిసరి..

వంట సామగ్రిని పొడి ప్రాంతాల్లో నిల్వ ఉంచాలని, వంట చేసే ముందు ప్యాకెట్ల ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించిన తర్వాతే వంట ప్రారంభించాలని సూచించారు. ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, విద్యాశాఖ అధికారి విజయకుమారి పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు



జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

అల్వాల్: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి అధికారులు ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపించారు. సోమవారం మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమ డివిజన్లలోని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి స్థానిక బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు వారు పనిచేస్తున్నారని ఆరోపించారు. సదరు అధికారులపై శాఖాపరమైన, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరామన్నారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్, నేరేడ్‌మెట్ కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి, గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్పల పాదయాత్ర



శబరిమలకు పాదయాత్రగా వెళ్లిన అయ్యప్పస్వాములు

బోడుప్పల్: భీమ్‌రెడ్డినగర్‌కు చెందిన అయ్యప్పస్వాములు శబరిమలకు పాదయాత్రగా వెళ్లారు. సింగిరెడ్డి రాజారెడ్డి, తిరుమలరెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు 41 రోజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మాలధారణ చేశారు. 39 రోజుల పాటు పాదయాత్ర చేసి శబరిమల చేరుకుని స్వామివారి మొక్కులు తీర్చుకుని, ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాదయాత్రగా వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకోవడంతో ఓ గొప్ప అనుభూతి పొందామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించాలి

అల్వాల్: ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని మచ్చబొల్లారం బీజేపీ నేతలు కోరారు. తుర్కపల్లిలోని పాఠశాలను సోమవారం వారు పరిశీలించారు. పాఠశాల భవనం సైతం శిథిలావస్థలో ఉందన్నారు. చుట్టూ పిచ్చిమొక్కలతో భయానకంగా మారిందని, విద్యార్థులు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి కనీసం ఏర్పాట్లు చేయాలని కోరారు. బీజేపీ నేతలు అజయ్‌రెడ్డి, కరుణశ్రీ, మాచర్ల శ్రీనివాస్, ఉదయ్, ప్రకాష్, విజయ్, అనురాధ తదితరులున్నారు.



తుర్కపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన బీజేపీ నేతలు

వైద్యాధికారుల తీరు మార్చుకోవాలి

కార్మికులను అవమానిస్తున్నారని ఆందోళన



ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

మల్కాజిగిరి: ఆర్‌కేనగర్‌లో ఉన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వైద్యుల తీరు మార్చుకోవాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం డిస్పెన్సరీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికులు, ఈఎస్‌ఐ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సేవలు పొందేందుకు ఉన్న డిస్పెన్సరీ అధ్వానంగా నడుస్తుందన్నారు. ముఖ్యంగా మున్సిపల్ సిబ్బంది పట్ల అవమానపరిచేలా వైద్యులు వ్యవహరిస్తున్నారని, తీరు మార్చుకోకపోతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నాడి పట్టకుండానే మందులు రాస్తున్నారని, ఆ మందులు కూడా డిస్పెన్సరీలో దొరకడం లేదని వాపోయారు. సమయపాలన కూడా పాటించడం లేదని, తీరు మారకుంటే త్వరలోనే పెద్ద ఎత్తున కార్మికులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నిక్రిష్ణన్, నాయకులు నర్సింగరావు, నాగరాజు, లక్ష్మణ్, కనకయ్య, కృష్ణ, స్వర్ణలత, శాంత, జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల నిరసన



మాట్లాడుతున్న మాలధారులు

రామంతాపూర్: ఇందిరానగర్ రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ ఫౌండర్ కోట్ల నరసింహారెడ్డిని పదవి నుంచి తొలగించాలని అయ్యప్ప స్వాములు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ గురుస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలాగే ఆలయంలో ఈసారి కూడా విడిది ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించుకుంటున్నామన్నారు. అయ్యప్ప స్వాములను ఆయన అసభ్య పదజాలంతో దూషించాడని ఆరోపించారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఆలయానికి వచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. దీనిపై ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

నీటి వృథాను అరికట్టడానికే :నరసింహారెడ్డి

ఆలయంలో నీటిని వృథా చేస్తున్నారన్న విషయం తెలుసుకుని మోటార్ స్విచ్ఛాఫ్ చేశానని, దీంతో స్వాములంతా కలిసొచ్చి వచ్చి నిర్బంధించారని ఆరోపించారు. తాను మద్యం తాగి ఆలయ ప్రాంగణంలోకి వెళ్లిన మాట వాస్తవం కాదన్నారు. దీనిపై తాను కూడా పోలీసులకు ఫిర్యాదు చేశానని వివరణ ఇచ్చారు.

ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ

కార్తీకమాస ఆఖరి సోమవారం ప్రత్యేక పూజలు • భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



మారుతీనగర్ శివాలయంలో అభిషేకం



స్వామివారి దర్శనం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రామంతాపూర్: పవిత్ర కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ఉప్పల్ సర్కిల్‌లోని రామంతాపూర్, ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. రామంతాపూర్‌లోని సత్యదేవుని ఆలయంలో మల్లికార్జునస్వామి దేవాలయం కోదండ రామలింగేశ్వర ఆలయం, మార్కండేయ స్వామి దేవాలయం, వెలుగుట్ట మల్లికార్జున భ్రమరాంబికాదేవీ దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి.

కుషాయిగూడ: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్ సోమవారం కీసరగుట్టలో రుద్రాభిషేకం చేశారు.



సత్యదేవుని ఆలయంలో..

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని శివాలయాలు భక్తుల రద్దీతో నిండిపోయింది. మారుతీనగర్‌లోని శివాలయం, శివపురికాలనీలోని భ్రమరాంబికాసహిత మల్లికార్జునస్వామి దేవాలయం, నేరేడ్‌మెట్‌లోని కాశీఅన్నపూర్ణసహిత మల్లికార్జునస్వామి దేవాలయంతో పాటు పలు దేవాలయాల్లో సామూహిక అభిషేకం, అర్చనాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఆనంద్‌బాగ్ సాయిబాబా దేవాలయంలో..

బోడుప్పల్: శ్రీసాయి భవానీనగర్ కాలనీలోని స్ఫటిక లింగేశ్వర సహిత సీతారామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం 5 గంటల నుంచి బారులు తీరి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో ఆలయ ధర్మకర్త జడిగె మంజుల రమేష్‌యాదవ్, ఆలయ అర్చకులు రాహుల్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మేయర్



మంత్రి శ్రీధర్‌బాబుతో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: వక్ఫ్‌బోర్డు విషయంలో కలెక్టర్ ఇచ్చిన నివేదికను రెవెన్యూశాఖ త్వరగా పరిష్కరించాలని సోమవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశారు. చెరువుల అభివృద్ధి విషయంలో ఎన్‌టీసీ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరగా, వెంటనే మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పొద్దుటూరి వెంకటేశ్‌గుప్తా తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ



జి.రఘు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా జి.రఘు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న త్రిలేశ్వర్‌రావు సెలవులపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా జి.రఘును ప్రభుత్వం నియమించింది. గతంలో జవహర్‌నగర్, కొత్తగూడెం, బడంగ్‌పేట్, కొంపల్లి, పోచారం మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మొదటిరోజు సమగ్ర ఇంటింటి కులగణన సర్వేపై సమీక్ష నిర్వహించి, కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు.

సేవతోనే సంతృప్తి



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

గౌతంనగర్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ సైనికుడు పి.సత్యనారాయణ అన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం గౌతంనగర్ డివిజన్ రాజానగర్‌లోని ఆయన నివాసంలో పలువురు మహిళలకు నిత్యావసర వస్తువులు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌తో ఆలోచన శక్తి మెరుగు



చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాల సైన్స్‌ఫేర్‌లో కార్పొరేటర్ గీత

ఉప్పల్: సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సొంతంగా ఆలోచించే శక్తి పెరుగుతుందని కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు అంశాలను కార్పొరేటర్ నిశితంగా పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



ఉప్పల్: ఉప్పల్ కాల్వా 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు శాంతినగర్, ర్యాంకర్ స్కూల్, గాంధీ విగ్రహం, సీఎంఆర్ లేన్, ఉప్పల్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

హబ్సిగూడ పరిధిలో..

సీసీఎంబీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీధినంబర్ 1, 2 ,3, భవానీనగర్, వీఎస్టీ కాలనీ, రాజీవ్‌నగర్, వీధి నెంబర్ -1 హెచ్‌ఎంటీ నగర్ మెయిన్‌రోడ్డు, పోలేరమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బొల్లిగూడ ఫీడర్ పరిధిలోని ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంజయ్య ఎన్‌క్లేవ్, బొల్లిగూడెం, అమ్మసాని వెంకట్‌రెడ్డినగర్, ఎస్‌బీఆర్‌కాలనీ, టెలిఫోన్‌కాలనీ, రాజలింగం ఫేస్1, 2, సూరజ్‌నగర్, మహాలక్ష్మినగర్, బాలాజీనగర్, లక్ష్మారెడ్డినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ గంగాభవానీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మజీద్ ఫీడర్ పరిధిలోని శ్రామిక్‌నగర్, మారుతీనగర్, రాష్స్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు, గాంధీనగర్ ఫీడర్ పరిధిలో ఈస్ట్ ప్రగతినగర్, చందాబాగ్, బోరబండ, ఎంజేకాలనీ, గాయత్రీనగర్, మహేష్‌నగర్, సౌత్ కమలానగర్, జీహెచ్‌ఎంసీ పార్కు, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు, అణుపురం, శ్రీరాంనగర్, ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ, గోకుల్‌నగర్, మారుతీనగర్, ప్రగతీనగర్, క్రియోటివ్‌నగర్, శ్రామికనగర్, ఏఎస్‌రావునగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

అల్వాల్: యాప్రాల్‌లోని ఎంప్లాయిస్ కాలనీలో లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్, బేగంపేటకు చెందిన సన్‌షైన్ కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బీపీ, షుగర్, బరువు, ఎత్తు, ఈసీజీ, బీఎండీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు శ్రవణ్‌కుమార్, రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణబాబు మాట్లాడుతూ.. ట్రస్టు ఏర్పడి పదేళ్లు అవుతుందన్నారు. ట్రస్టు పదో వార్షికోత్సవం సందర్భంగా సుమారు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ధనలక్ష్మి, వెంకటేష్‌గౌడ్, సంజయ్‌లాల్, నవీన్, వినయ్, కపిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

గౌతంనగర్: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహేంద్రహిల్స్‌లో ఉన్న రిజర్వాయర్ నుంచి గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన అన్ని కాలనీలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. జలమండలి ఏఈ స్రవంతి, నాయకులు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మల్కాజిగిరి: నేరెడ్‌మెట్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్త చట్టాలు, సైబర్‌క్రైమ్, ట్రాఫికింగ్ అంశాలపై ఎస్సై రాములునాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మానవ అక్రమ రవాణాలో భారతదేశం మూడో స్థానంలో ఉందన్నారు. చిన్నతనంలోనే బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, ఇతర దేశాలకు అమ్మడం లాంటి అంశాలపై అవగాహన ముఖ్యమని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం చట్టాలు మారాయని వాటిపై విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎలాంటి అనుమానం వచ్చినా 100కు, సైబర్ మోసానికి గురైతే 1930, మహిళలు హెల్ప్‌లైన్ కోసం 1091, 181కు, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098, 112ను సంప్రదించాలన్నారు. ఏఎస్సై వెంకటస్వామి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రాములునాయక్

ప్రజావాణికి 11 ఫిర్యాదులు



సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి 11 ఫిర్యాదులు అందాయని ఉపకమిషనర్ రాజు తెలిపారు. రెవెన్యూ విభాగంలో రెండు, ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు, టౌన్‌ప్లానింగ్ విభాగంలో రెండు, యూజీడీ విభాగంలో ఒక్కటి, విద్యుత్ విభాగంలో రెండు ఫిర్యాదులు అందాయని వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌లు సైతం ఫిర్యాదు చేశారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు



రేణుకా ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రామంతాపూర్: గాంధీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ 11వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. అమ్మవారి చల్లని చూపుతో తమ కాలనీలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు ముత్యాల నరసింహ, అధ్యక్షులు వెంకటేశచారి, ప్రధాన సలహాదారు యాకరి స్వామి, ప్రధాన కార్యదర్శి ఇటికాల సతీష్, కోశాధికారి భాషా, భిక్షపతి, ప్రధానార్చకులు పత్తిపాక శేఖరాచారి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్, పిట్టల బస్తీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కాలనీలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, స్తంభాలను ఆయన పరిశీలించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను కోరారు. జీహెచ్‌ఎంసీ ఏఈ స్రవంతి, ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, విద్యుత్ ఏఈ నాగరాజు, నాయకులు నెమలి రవి, నాగరాజు, మధుసూదన్, భారతి, రఘు, మహేష్, అంజన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

కుషాయిగూడ: కుషాయిగూడ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ప్రతి 4 నెలలకోసారి లెక్కించే స్వామి హుండీ లెక్కింపు ఎండోమెంట్ అధికారి ప్రణీత్‌కుమార్, ఈవో వీరేశం, ఆలయ చైర్మన్ సంకూరి శ్రీనివాస్‌గౌడ్‌ల పర్యవేక్షణలో లెక్కించారు. ఈసారి స్వామివారికి రూ.5,83,280 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రమణపంతులు, వేణు, తాళ్ల వెంకటేష్, అమరచారి, రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

నేడు మేడ్చల్‌కు మంత్రుల రాక

మేడ్చల్‌రూరల్: నేడు మేడ్చల్‌కు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మేడ్చల్ మార్కెట్ కమిటీ నూతన భవనం ప్రారంభోత్సవంతో పాటు.. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సింహులుయాదవ్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకరణ మహోత్సవంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

గుర్రపుడెక్క నివారణకు చర్యలు



డ్రోన్ ద్వారా మందును పిచికారీ చేయిస్తున్న దృశ్యం

ఉప్పల్: దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ నల్లచెరువులో రూ. 85 లక్షలతో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయని, వాటి నిర్మూలనకు చెరువులో గుర్రపుడెక్క తొలగింపునకు ద్రావణాల పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. నల్ల చెరువులో గుర్రపుడెక్క సమస్య తీవ్రంగా ఉందని, దీని పరిష్కారానికి మందును పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

మేడ్చల్: మేడ్చల్ పట్టణ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె సోమవారం జవాన్లు, డ్రైవర్లు, డోర్ టూ డోర్ చెత్త సేకరించే వాహనదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. వార్డులలో దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. నీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటిని సరఫరా చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.